# ఎండి మొదలూ.. బంగారపు కొమ్మలూ.. అపరంజి ఆకులూ.. ముత్యాల గుత్తులూ.. హంస నాట్యమూ..

ఒక ఊరిల ఒక రాజున్నాడట. ఆ రాజు పట్టాభిషేకం కట్టుకోని రాణీతోటున్నాడు. కొన్నాళ్ళకి ఒక కొడుకు కలిగినాడు. కలిగిన కొన్నాళ్ళకి భార్యా భర్తా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మరి ఎలాగాలకి తగువొచ్చిందో.. చిన్న తగువు.. అ తగువుతోటి విడిపోతారు.

ఆవిడికి.. రాణీకి ఒక ఇల్లు కట్టీసి.. రోజు భత్యం రోజు ఏసి పిల్లడితోటి ఆ ఇంటిల పెట్టి ఇతను మళ్ళీ పెళ్ళిసేసుకున్నాడట. పెళ్ళిసేసుకుంటే మళ్ళీ ఇద్దరు పిల్లలు పుడతారు.

అయితే, అలాగ రాజు రాజ్జిం పాలిస్తన్నాడు. కొన్నాళ్ళయిపోయింది. తొలి భార్య కొడుకుని పెట్టుకోని సదివించుకోని సేసుకోని పాపం అలాగ వున్నాదట. కొడుకు వయిసినోడయినాడట.

ఎనక భార్యకు పుట్టిన ఇద్దరు పిల్లలూ వయిసినోలయినారట.

రాజు ముసిలోడయి పోనాడు కదా?!

అయితే, రాజుకి ఒక రోజు కలవొచ్చింది.

ఏటని వచ్చిందీ?

**ఎండి మొదలూ...బంగారం కొమ్మలూ....అపరంజి ఆకులూ.. ముత్యాల గుత్తులూ... అందమీద హంస నాట్యం** సేసినట్టుగ కలవొచ్చింది!

తెల్లవారిలెగిసి రాజు 'నాకా సెట్టు ఎవులు సూపిస్తారో.. ఆలకి అర్ధరాజ్యం ఇస్తాను. పట్టాభిషేకం కట్టిస్తాను. మరి ఆసెట్టు తెచ్చి సూపించినోలికే అన్నీ' అనీసి దండోరా ఏయించినాడు.

ఎవులు తేగలరు?


ఎవులు సూపించగలరు?

ఎక్కడున్నాదా సెట్టు? ఎవలకి తెలుస్తాది?

ఎవ్వలికీ తెలీదు కాబట్టి అందరూ ఊరుకున్నారు. మరి ఈ రాజు ఊరుకుంతాడా?!.... అలాగ ద్యాస పెట్టుకోని ..ద్యానం పెట్టుకోని... మనోవ్యాధికి మందులేనట్టు.. రాజ వైద్యులెంత మందులిచ్చినా ఒప్పక ఆరాజు అలాగ కృంగి కృశించి పోయి మంచం పట్టీసీనాడు.

అయితే, మంత్రేమో రాజుగారి పెదభార్య దగ్గిరికి వచ్చినాడు. వచ్చి 'అమ్మా.. రాజుగారి పరిస్థితి ఏమి బాగోలేదమ్మా.. రోజుకి రోజు.. రోజుకిరోజు. అలాగ క్షీణించిపోయి మంచం పట్టిపోయినాడు. మరి ఎలగ? ఏటి? పరిస్థితి చెయ్యిజారిపోయినట్టుగ వున్నాది.. 'అని సెప్పాడట మంత్రి.

'అయ్యో నాయినా.. నన్ను కాదన్నా.. నీను అక్కరలేకపోయినా.. ఇంతపసుపూ కుంకుమతోటి.. ఎక్కడ పేరంటకమంటే... మంచంటే.. చెడ్డంటే ఎలిపోతన్నాను. సేచ్చగా. నాకు బగమంతుడు



సూడు ఎంతపనిసేస్సినాడు? పెనిమిటి దూరమయింది గాక, పున్నిస్త్రితనమూ దూరం సేసెస్తాడు గావాల..' అనీసి పాపం బాధపడి ఏడిసిందట.

'మరేటి సేస్తామమ్మా. విధిరాత ఎలగుంటే అలగ తప్పదు' అనుకోని ఆమంత్రి సెప్పీసి ఎలిపోయినాడు.

అలాగ ఆడు ఎలిపోయిన తరవాత ఈవిడ ఏడుసుకోని కూకుందట. కొడుకు సదువుకెళ్ళి వొచ్చినాడట. తల్లిని సూసి 'ఏమలగున్నావు?' అని అడిగినాడట.

ఈపూట అడ్డడు బియ్యమూ తోటకూర కట్ట.. ఆ పూట అడ్డడు బియ్యమూ తోటకూరకట్ట.. అలాగ ఏసోడట రాజు. అయినా ఆవిడ ఏమివ్వలేదని గాని .. పుచ్చుకోలేదనిగాని..పట్టపురాణీని నాకులేదు.. దనికి వన్నాదనిగాని- ఏటనకుండా కొడుకే కబోలు అనుకోని పెంచుకోని వచ్చిందట... ఇంత కాలమూ?!

వచ్చినదయి, రాజుకెప్పుడు బాగోలేదో ఏడుసుకుంతంది.

'ఏమలగున్నావు?' అని కొడుకు మళ్ళీ అడిగినాడు. 'ఏమీ లేదయ్యా కొంచిం తలబాదగున్నా దయ్యా...' అనంతే-'లేదు..లేదు.. నీను సిన్నప్పుడినుండి సూస్తన్నాను కానా.. నిజం సెప్పుతావా? సెప్పవా?' అని అడిగితే-

'లేదయ్యా ముందు.. తిను' అని అన్నం వడ్డించిందట.

'లేదు.. నువ్వు సెప్పితే తింతాను, లేకపోతే లేదు.. తినను' అన్నాడట ఆ పిల్లడు.

'నువ్వు సెప్పకపోతే కాదు..' అని కొడుకు ఒట్లూగిట్లూ ఏస్తే- సరేనని చెప్పింది. విదిలేనప్పుడు ఏటి చేస్తాది?


'నాయినా మీనాన్నకేమో.. ఇలగ కలొచ్చిందట. ఎండి మొదలూ.. బంగారం కొమ్మలూ.. అపరంజి ఆకులూ.. ముత్యాలగుత్తులూ.. అందమీద హంసనాట్యం సేస్తున్నట్టుగ కలవచ్చిందట. ఈ సెట్టుని ఎవులు తెచ్చి సూపిస్తే ఆలకి అర్థరాజ్యమూ పట్టాభిషేకమూ కడతానని దండోరా ఏయించినాడట. మరి ఎవ్వులు తేగలరు? ఈ సెట్టు ఎక్కడ వుంటాది? మీనాన్న అలాగ మనోవ్యాది తోటి మంచం పట్టీసినారట నాయినా...' అని సెప్పిందట. సెప్పి ఏడిసిందట.


'అయితే అమ్మా నీను బయల్దేరుతాను. నీనెళ్ళి నానగారికి సెప్పీసి.. నీనా సెట్టు ఎక్కడున్నా పట్టుకోనొస్తాను..' అన్నాడట కొడుకు.

‘ఏమి జడ్డిమాటలాడతన్నావూ? ఆసెట్టు ఎక్కడుంటాది? ఎక్కడ తేగలవు?’ అని తల్లి అన్నాదట. ‘లేదు.. లేదమ్మా.. నీను తప్పకుండతెస్తాను..’ అన్నాడట. వద్దని తల్లన్నాసరే ఎంత మాత్రం ఒప్పలేదట. ‘తండ్రి కోరిక తీరసని బతుకు ఎందుకు? నీను ఎందుకు? పెంచకపోయినా... వుంచకపోయినా తండ్రి ఋణం కన్నందుకయినా తీరునుకోవాలి గదా?’ అనుకోని బయల్దేరిపోనాడు.

తండ్రి దగ్గిరికెళ్ళినాడట. ‘నాన్నా... మీకేమి కలొచ్చింది? సెప్పండి... నీను తెస్తాను.. తీరుస్తాను’ అన్నాడు.

‘పోరా..నువ్వు తెచ్చేదేటి? నువ్వు





తెచ్చేస్తావూ... మరెవుడికి ఎరికలేదూ' అనీసి తండ్రి అన్నాడట.

సరేననీసి, మంచంమీద పడుకోని వున్న తండ్రి కాలుకి దండం పెట్టీసాడు. ఎలిపొచ్చీసాడు. తల్లికి దండం పెట్టాడు. 'అమ్మా...నువ్వు నాకు దీవించి పంపు... నేను తప్పకుండ విజయముతోటి వస్తాను...' అనీసి సెప్పితే- సరేనని దీవించి బొట్టుపెట్టి పంపించిందట. తల్లి ఇంత సల్దన్నమూ.. ఇంత వూరగాయ పెట్టి కట్టిందట. ఎంతో కొంత దనమిచ్చిందట. వున్నికాడికి వూరిసి ఇచ్చిందట. ఎళ్ళిరా' అన్నాదట.

ఈడు మంత్రికాడికి ఎళ్ళినాడట.

'మంత్రిగోరూ 'ఆఁ' అంటే ఆరు మైళ్ళు ఎళ్ళిన గుర్రం కావాలి నాకు...

మంచి గుర్రమివ్వాలి నాకు...' అని అడిగినాడట.

మంత్రి గుర్రాల సావిడి దగ్గిరకెళ్ళి' అయ్యా... ఈ గుర్రము.. పంచకళ్యాణి గుర్రము నువ్వు ఎలగ సెప్పితే... నీకు అలగే ఇంటాది. కాబట్టి నువ్వు దీన్ని తీసుకోని ఎళ్ళు...' అని సెప్పినాడట.

సరేనని మంత్రిగారికి

ఎళ్ళొస్తానని చెప్పి... ఆయనకీ నమస్కారం పెట్టాడు. బయల్దేరినాడు అతని దీవెనలు కూడా తీసుకోని.

తిన్నగ ఎళ్తన్నాడు..

సీమలు దూరని సిట్టడివి.. కాకులు దూరని కారడివి... గెద్దలు దూరని పెద్దడివి... గండబేరుండాలు దూరని రండడివి.. కొండలు... కొనగిరులు... లోయలు దాటి ఎల్తన్నాడట.

ఎల్తుంటే-

ఎలగ తెలసిపోయిందో... సిన్నదాని కొడుకులకి!? 'అమ్మా అన్నగాని ఆ అపరంజి సెట్టు తెచ్చిస్తే.. అయ్య ఆడికే రాజ్జిం రాసీసి పట్టాభిషేకం జరిపేస్తాడు. ఎలగయినా మాయజేసి ఆడ్ని సంపీసయినా.. మీమా సెట్టూ పట్టుకోని వచ్చేస్తాము. ఆడు మా కానోడు. ఎలగయినా సెట్టు తెచ్చీగలడు. ఆడు అంత సాహసీకుడు. ఆడి నుండి మీమే తెచ్చేసీ రాజ్జిం కాపాడుకుంతాము. ఆడే రాజయి పట్టాభిషేకం కట్టిస్తే- మనము ఎప్పుడులాగ కాక, ఇకన ఆలపరిస్థితికి మనమెలిపోవాలా..' అనీసి కుట్ర పన్నినారట. ఆ తల్లీకొడుకులు.

అలగేనని తల్లి బెత్తాయించింది. కొడుకులూ ఎళ్ళినారు.

ఇటుకీ అటుకీ మద్దిన విడిదిలాగట ఒక ఊరు వున్నాది. అక్కడ కలుసుకున్నారట. తమ్ముడంటే- అన్నా- అన్నంటే -తమ్ముడూ అని అనుకుంటున్నారట. ఇలగేటి వచ్చినారు? నాన్నకి సెట్టు తేడానికి! మరి మీరు దేనికి? మీమూ అందుకే బయల్దేరినాము అన్నారట.

అయితే-

ఇది పులులూ సింహాల తోవ. ఈ తోవ ఎళ్తారా?

ఇది ముళ్ళూ రాళ్ళు తోవ. ఈ తోవ ఎళ్తారా?

లేకపోతే- ఈరొండూ కాకపోతే-

ఇది బళ్ళుతోవ. ఈ తోవ ఎళ్తారా?

మూడు తోవలున్నాయి. మద్దికాన ఇది. ఏతోవ వస్తారంటే-

'అమ్మ బాబోయ్... ముళ్ళుతోవ ముళ్ళు గుచ్చుకుంటాయి. పులులూ సింహాల తోవనయితే పులులూ సింహాలూ తినేస్తాయి. మీము సుట్టుతిరిగయినా బళ్ళతోవనే వస్తాము...' అనుకోని ఆ ఇద్దరన్నదమ్ములు అనేనారట.

‘అయితే మీరా బళ్ళుతోవన రాయండి’ అనుకోని ఈడు ఈ పులులూ సింహాలతోవన ఎళ్ళినాడట. ఎల్లగా ఎల్లగా ఎల్లగా పొద్దుబోయీ సరికి మాంచి అడివి నడుమన సేరి దొరికిపోయినాడట. ఎంత పరిగెడతాదా గుర్రము? అదయినా జీవేనా?! మరీ రాతిరవుడు ఎళ్తే ఎంత దూరమెళ్తాడు? ఎంతదూరమెళ్తే వుందో అడివి అంతు..?!

సీకటయిపోతంది. అడివిల సెట్లూ పుట్టలకి మరీ సీకటయి పోతాదిగదా.. మాంచి అడివి మార్గాన కెళ్ళాడు. ఒక చెట్టుకొచ్చి గుర్రాన్ని కట్టాడు. కిందనే వుంటే అసలే పులులూ సింహాలతోవ.. ఏమృగాలొస్తాయోననీసి సెట్టు సిగూరుకి ఎలిపోయికూసున్నాడు.

అక్కడ సెట్టుకి గుర్రం కట్టిన కొద్ది దూరంలోన పేద్ద కోరుపుట్ట వున్నాదట. ఆ పుట్టలోంచి మాంచి రేతిరికాడ నాగేందురుడు బయల్దేరినాడట. ఎంత వలమున్నాదు? తాటి సెట్టంత వలముతోటి బయటి కొచ్చినాడట. బయటికొచ్చి పన్నెండు శిరసులు ఇప్పాడట. ఇప్పీసరికి-?! ఇంత సీకటయిన అడివికూడా ఎన్నిలి... ఎన్నిలి... ఎన్నిలి.. పిండారబోసిని ఎన్నిలయిపోయింది. అయిపోయీసరికి-

ఈ పామట రోజు రేతిరి అడివంతా తిరగడమూ ఏజంతువు దొరికితే ఆజంతువుని తినేడమూ - మళ్ళ ఎప్పుడులాగ పుట్టలోకి ఎలిపోడమూ! దనిది రోజూ అదే కొలువు!?

అయితే పాపమీ గుర్రము దొరికి పోయింది...

ఆ గుర్రాన్ని ఈ సర్పము తినీసింది!

తినీసి, మళ్ళెప్పుడులాగ లోనికెలిపోయింది. ఎలిపోయీసరికి.. ఈడు సూస్తున్నాడు.. ఈ రాజుకొడుకు.. ఈ సిన్నవాడు.. సూసి ఏటిసేసాడూ? ‘అమ్మ నాయినా ఏటీ ఇసిత్రమూ.. పామేటి రావడమేటి? పన్నెండు శిరసులుండడమేటి? అది వొచ్చిన తరవాత ఇంత సిట్టి సీకటి కూడా ఇప్పపూల ఎన్నిలయి పోడమేటి? ఇదేదో వింతలాగుంది... దీని అంతు సూడాల..’ అనుకోని తెల్లారినదాక పవనం పట్టి వున్నాడు. సెట్టుమీద నిద్దర పడతాదే ఏటి? జారిపోతానని!? అలాగ అందమీదే వుండిపోయి పరిపరి విధాలు ఆలోసించినాడు.

ఆలోసించి... ఆలోసించి... తెల తెలకవ అయిపోయింది. దిగినాడు సెట్టు. అలగ నడిసి... నడిసి. నడిసి ఆ ఒడ్డుకు సేరుకున్నాడు. ఏ ఒడ్డుకీ? అడివి ఒడ్డుకి!

అక్కడొక వూరున్నాదట సిన్నది!...

మంగలి కొట్టుకెళ్ళాడట. ఎళ్ళి 'మంత్రీ' అని 'నీను నీకు డబ్బు ఇస్తాను. నీదగ్గిర మంగలి కత్తులున్నాయి కదా.. మంచిగ.. సానపట్టి నాకియ్యి.. ఇలగ పదును సూద్దుమని సెయ్యి ఏస్తే సెయ్యితెగి పోవాల..' అనీసట అన్నాడట.

'సరే బాబు' అనీసి కత్తులు మంచిగ తీడీసి మరీ ఇచ్చినాడట మంత్రి. ఒక ఇన్ని ఇచ్చినాడట. ఇస్తే- మళ్ళ తిన్నగ నడిసి నడిసి పొద్దు బోయీ సరికి ఎప్పుడులాగ అడివికి వొచ్చీసినాడట. ఎక్కడయితే పుట్టుందో మళ్ళీ అక్కడికే వచ్చాడు. తప్పిపోకుండ ఆనవాలు పెట్టుకున్నాడు. వచ్చిమళ్ళ సెట్టెక్కాడు. ఎక్కడిదాక? సెట్టు సిగూరు దాక!

ఎక్కి పోయినా సరికి-

మళ్ళా అలగే.. మాంచి అర్ధరేతిరవుడు మళ్ళా ఆసర్పం లోనుండి బయిటికి వచ్చింది. చుట్టుసూసి అడివిలోకి ఆహారానికి ఎలిపోయిందట. అది అడివిలోకి ఎలిపోయీసరికి ఈడు గబగబా సెట్టుదిగినాడట. ఈ జూబులోన కనబడ్డంలేదు.. లేక పోతే ఈడ్నీ తినీదా?!...

సెట్టుదిగి పోనాడు. తాటిసెట్టంత వలం కదా.. అంత కన్నం సుట్టూ వరసగా లోపు కానుంచి కత్తుర్లు పేర్చీసి పెట్టీసినాడు. పెట్టీసి తిరిగి సెట్టెక్కి పోనాడు.

అది.. ఆ సర్పము... ఏదో తిన్నాది.. తినీసి మళ్ళొచ్చి.. అందల.. ఈ కన్నంల తూరడానికి మూతెట్టింది. నాగలోకం లోకి ఎలిపోడానికి. అప్పుడేటయ్యిందీ? ఇకన మూతెప్పుడయితే ఎట్టిందో.. సురుక్కుమని తెగిపే! అర్రే... ఇదేటి తెగిపోతందనీసి ఇలాగ తిరిగీసరికి పామంతా తెగిపోయింది.

కొట్టుకోని సచ్చిపోయింది!

చచ్చిపోయీసరికి, తెల్లారిన వరకు వూరుకున్నాడు. తెల్లారిలెగిసి దిగినాడు. ఆ సర్పానికి ఎవుల లాగగలరు? పామంతా బయటేవుంది కదా? తల ఏమో కష్టంమీదో నష్టం మీదో.. తాలు అక్కడేటి వుంతాయి? తీగలు లతలు అల్లివుంటాయి కదా బడ్డుల్లాగ. అటితోటి కట్టి ఎలగో ఈడిసినాడు. తలాగట్రాలాగి... ఈ కన్నం కాదు.. సొరంగం.. ఇందలెల్లి ఎలతాను. ఏటయితే అదేకాని. బగవంతుడు ఎలగసూస్తే అలగే సూడనీ' అనుకోని -తిన్నగ ఆ సొరంగం లెల్లి ఎలిపోయినాడు. ఈ సిన్నవాడు... ఈరాజు కొడుకు ఎప్పుడయితే ఎళ్ళినాడో.. సొరంగంలెల్లి ఎల్లిన తరువాత ఏటయ్యిందీ?

ఆ సర్పరాజు.. ఆ నాగేందురుడికి ఐదుగురు కూతుర్లట!

అందలోన పెద్దదాయి గొప్ప ముక్కోపి అట!?
గొప్ప కోపమట. 'ఛీ.. నరకంపు నరకంపు... ఏటీ నరవాసన? అనుకోని ' ఎవడొచ్చాడు? ఏటి?'
అనుకోనంతే-
సిన్నదయట. అంత శాంతపరురాలట. ఆవిడ అన్నాదట. ' ఎందుకలగ గాబరయిపోతన్నావూ?
ఎందుకలగ శపించీబోతన్నావూ? ఆగు.. ఏటయిందో.. మన నాయిన ఏటయినాడో అడుగుదుము.
ఎలగొచ్చాడు? ఏటి? చిన్నవాడు..' అనంతే- అప్పుడేమో కోపం తగ్గించుకోమంతే- అప్పజెళ్ళిళ్ళు
సెప్పితే - కనుక్కుంతాను అంతే - ఆ తర్వాత శపించో ఏదో సేతుము అంతే - అక్క ఆగ్రహం
బిగబట్టిందట.
అప్పుడా అయిదుగురు అప్పజెళ్ళిళ్ళు.. అకన్నెలు..అడిగారట.' నువ్వెవరు?
ఏటి? ఎందుకొచ్చావ్? సెప్పు?' -అనడిగితే-
'నీను ఫలానా రాజు కొడుకును..' అని ఇలగిలగ సెప్పినాడట.
'మరి మా తండ్రేటయినాడు?'
'మీరు శపించనని ఒట్టేస్తే సెప్పుతాను' అన్నాడట ఈడు.
'సరే సెప్పుయితే..' అన్నారట. ఒట్లేసినారట. ఏస్తే-
అప్పుడు ఇలక్కిలగ సేసాను. ఏదున్నాదో అని ఈ కింద సొరంగం లెల్లి ఎల్తే?' అని వొచ్చినాను..'
అని చెప్పేడట.
అయితే-
'మా తండ్రి వీరాధివీరుడు. మాతండ్రిని జయించినోడు ఇప్పుడికి లేడు. అలాటి పెద్ద.. నాగజాతి
పెద్ద.. నాగరాజునే చంపినావంటే... నువ్వు సిన్నింటోడివికాదు. నువ్వే ఈరాది ఈరుడివి... మా
పెనిమిటివి' అనీసి అయిదుగురు అప్పజెళ్ళిళ్ళూ అతగాడ్ని గాందారి వివాహం సేసుకున్నారు.
సేసుకున్న తరువాత, మనిషికాడ ఒక్కొక్కనెల గడిసిందట. నలుగురి దగ్గిర నాలుగు మాసాలు
గడిసిందట. ఐదోమాసం సిన్నదాని దగ్గిరికి వొచ్చినాడట...
ఆరునెల్లుకి తిరిగొస్తానని ఇంటిదగ్గర సెప్పుకోని వచ్చున్నాడు కదా.. 'అమ్మా సెట్టువున్నీ లేకపోనీ
ఆరుమాసాలయిసరికి తిరిగొస్తానని అనున్నాడు కదా...
అందుకే.. అలాగ ఈసిన్నవాడు ఇచారంగా కూకున్నాడట!

అయితే, ఆవిడ అడిగిందట.
'ఏవండీ.. ఈ మద్దినంతా మాయక్కలందరి దగ్గిర ఆనందంగున్నారు. ఇప్పుడు నాదగ్గిరికి వొచ్చీసరి ఎందుకలాగ ఇచారంగా ఏదో ఇగోట్టుకున్నట్టుగున్నారు. దనికి కారణమేటో తెలుసుకోవచ్చునా' అనట అడిగింది.
అప్పుడ సిన్నవాడు చెప్పినాడట.
'నీను అందుకెందుకు బాదపడ్డం కాదు. నీను ఒక కార్యం మీదొచ్చాను నీను వచ్చిందొకటి. సేసిందొకటయి పోయింది. నా తండ్రెలాగున్నాడో? నాతల్లి ఎలాగున్నాదో? నాకోసం ఎదరుతెన్నుల సూసి. నీనొచ్చి నాలుగు మాసాలయిపోయింది. ఐదో మాసమొచ్చింది. ఆరుమాసాలకి తిరి వస్తానన్నాను. కాబట్టినాకు అదే ద్యానమయిపోయిందీ...' అనట అన్నాడట.
'ఏటండదీ?'
'ఏటిలేదు... ఇలక్కిలగ.. కలొచ్చింది మా తండ్రికి. అప్పడ్నుంచి మనోవ్యాదిలాగ మంచ పట్టీసాడు...' అనీసి సెప్పడట. సెప్పితే-
ఆ సిన్నదాయి పకపకమని నవ్విందాట.
'ఓసి ... దానికోసమే ఇంత బాదపడిపోతన్నారా? రేపు తెల్లారే నీకు ఆ సెట్టు సూపిస్తాను. మీర సూద్దురుగాని' అని అన్నాదట సిన్నదాయి.
'ఆఁ.. ఇక్కడున్నాదా?'
'ఆఁ.. ఇక్కడే వుంది, మా ఇంటి పెరడునే వున్నాది..' అన్నాదట. అలగనడంతోటి ఈడికి ఆనంద కలిగిపే. సరదాగ వున్నాడట. వున్ని తరవాత, తెల్లారి లెగిసి 'సిన్నదానా.. మరి సెట్టున్నాదన్నావు.. నాకు సూపించవా?' అనడిగినాడట.
'సూపిస్తాను. మాయక్కలకి సెప్పుతాను. నచ్చజెప్పి రొండ్రోజులుపోతే సూపిస్తాను' అన్నాదట సిన్నదాయి.
సూపిస్తానంటుంటే మరెందుకు గాబరయిపోవడమనీసి వూరుకున్నాడు.
అయితే, ఆ సిన్నదాయి అక్కలకి సెప్పిందట. అతనిలాటి పనిమీదొచ్చినారు అని. మనమ అతనికి ఆ సెట్టు సూపించాల' అనీసట అన్నాదట.
అయితే - సరే అంటే -సరేననుకోని - అతనికన్నా మనకేటి కావాలనుకోని ఈ ఐదుగురు

బాదపడ్డారు.
ఇకనేమో.. ఇంత ఈబూది మంతరించి ఇచ్చారట. అతనికి సెప్పేరట. 'మీము ఐదుగురమూ ఒకేలాగ ముస్తాబయి వస్తాము. నవ్వు బార్యలని సూడకుండా మాకు నరికీసావా.. మీము నీకు కావలసిన సెట్టవుతాము! లేదన్నావా?.. నీకు శపించీడమయమయిపోతాది.. నువ్వు శాపాలకు గురికావలసి వస్తాది..' అని సెప్పిందట. సిన్నదాయి.
'అలగేని' అన్నాడట ఈడు.
అన్ని తరువాత, పెద్దదాయి ముందొచ్చిందట. మంచిగ ముస్తాబయి. దాన్ని సూసి నిలబడిపోనాడు. ఎంతయిన బార్యకదా.. సంపడం కష్టం కదా.. అలాగ నిలబడిపోనాడు.
నిలబడిపోడంతోటి శపించీసిందట.
అప్పుడేమో ' ఏమే అక్కా వచ్చీసినావు' అని సిన్నదాయి పెద్దదాణ్ని అడిగిందట.
ఇలక్కిలగని సెప్పింది. 'నన్ను నరికి సంపీమంటే.. నిలబడిపోనాడు.. అలాగ నన్ను సూసుకోని వుండిపోయినాడు. అందుకే నీను శపించీసినాను' అని వున్నది సెప్పిందట.
'ఓలే.. ఎంత పని సేసావూ?.. రాయి సేసేస్తావా?' అనుకోని మళ్ళా వచ్చి, ఈబూది ఏసి మంతరించినారు.
'... ఇలగయితే నువ్వు సెట్టు సూడేలేవయ్యా.. ఇకన మీనాయిన అక్కడ సచ్చిపోడమూ.. నువ్వక్కడ వుండిపోడమూ... లేకపోతే ఎలిపోడమేగాని.. మరి ఆ సెట్టుసంగతి నీకు తెలీదు..' అని అప్పజెల్లిళ్ళు అంటే-
'సరే రాయండి.. ' అని..రాజు కొడుకు కదా దైర్యం తెచ్చుకోని ఆ ఈబూతి పొట్లాము జేబులోన పెట్టుకొని.. వచ్చినోలికళ్ళా నరికేత్తాన్నాడు.

**పెద్దదాయి వచ్చింది... నరికితే ఎండి మొదులయిపే!**

**రెండోదాయి వచ్చింది... నరికితే బంగారం కొమ్మలయిపే!**

**మూడోదాయి వచ్చింది... నరికితే అపరంజి ఆకులయిపే!**

**నాలుగోదాయి వచ్చింది.. నరికితే ముత్యాలగుత్తులయిలపే!**

**అయిదోదాయి వచ్చింది.. నరికితే హంస అయిపే! హంసయిపోయి అంద మీద నాట్యమాడింది!!**

'అమ్మా నాయినా..?!' అని ఈడి కళ్ళేసొమ్మగిల్లిపోనాయట. ' ఇంత అందమైన సెట్టు.. సెట్టుమీద

హంస నాట్యం ఇంత సక్కగుంటే.. అందుకే మానాయిన మనోవ్యాదికి గురయిపోయినారని.. అప్పుడు సూసినంత సేపు సూసినాడు. ఈ ఈబూతి ఏసీసరికి మళ్ళ అయిదుగురయిపోయినారు!? 'అయితే మరెందుకిక్కడ.. పదండి.. ముందుగుండే ఎలిపోదుమా రాజ్జింకి...' అనుకోని సుబ్బరంగ బయల్దేరినారట.

అప్పుడు సిన్నదాయి అన్నాది. 'మీము ఇలాగ్గాని వచ్చినామంటే.. ఎవులకయినా కళ్ళుకుట్టి ఏహానికయినా పూనుకుంతారు. అందుకని మీము అయిదుగురుమూ ఒక రథమవుతాము దాని మీద మీరు కూచోని తిన్నగ మీ ఇంటికి తీసికెళిపోయండి. మీకూ ప్రమాదముండదు మాకూ ప్రమాదముండదు' అనీసి సెప్పిందట.

సరేననగాన ఆలు ఐదుగురూ ఒక రథమైనారట!?

ఆ రథమ్మీద కూకోని సిన్నవాడు వస్తన్నాడట.

వస్తుంటే -

ఈలు... ఈమారటి తల్లి కొడుకులు.. బళ్ళుతోవన వచ్చినారుకదా? ఆలు వచ్చినప్పుడు తీసుకొచ్చిన డబ్బు... తోవలోన దొంగలు తీసుకున్నారు. గుండగ తన్నితే-

ఒకడొచ్చి ఆకులూరుకి సేరినాడట ఆకులమ్ముకోడానికి!

ఒకడొచ్చి మంగులూరికి సేరినాడట మంగలి పనికి!

అయితే- ఈ రథమొస్తుంటే- ఇమానములాగ శబ్దమొస్తందట. ఇచిత్రంగ వుందట. ఈ వింతసూడ్డానికి జనం ఇరగబడినారు. అందలోట ఈ అన్నదమ్ములున్నారు. సూసినారు. సూసి 'ఓరి మన తమ్ముడేనిరా... అన్నేనిరా' అని అనుకున్నారట. 'అన్నో...' అంటే 'అన్నో' అనుకోని 'మీ మిక్కడున్నాం' అన్నారట.

ఈ సిన్నవాడు రథము ఆపి, దిగినాడట.

'అరే.. ఏటిక్కడున్నారు? ఏటి?' అంటే-

'... ఇలక్కిలగయిపోయింది.. మీము ఎక్కడికీ ఎళ్ళలేదు...' అన్నారట ఆ ఇద్దరూ.

'సరే.. రాయండి.. ఇంటికెలిపోదుమ..' అన్నాడట ఈ సిన్నవాడు.

'నువ్వు తెచ్చావా?'-

'ఆ.. తెచ్చాను..' అన్నాడట.

'ఎక్కడుంది?'-
'తరువాత సూపిస్తాను' అనీసాడట.
పాపమీడు ఆలిద్దరికి కూడా రథమెక్కించినాడట.
ఈ పెద్దదానికి కోపమూ కోపమట! 'అరే... బయిటోలికి మా మీద కూచోబెడతారా?, ఇతనికి ఇదేమయినా బాగుందే? భర్తయి ఈయన కూచుంటే ఆలు కూచోడమేటి?' పెద్దదాయి అంటే-సిన్నదాయి 'వూరుకో వూరుకో..' అని అక్కడ బోదపెట్టి అలాగ తెస్తందట.
అలాగ రాగా రాగా రాగా-
'ఈడికి రాజ్జిం ఎలిపోకూడదు. ఈడ్ని ఎలగయినా సంపీయాలి' అనుకున్నారా మారటితల్లి పిల్లలు. అందుకోసమని ఆలు ఏటన్నారూ.. 'అన్నా.. అన్నా .. మాకు గొప్ప నోరెండి పోతంది... కసిన్ని నీలు తాగాల... తాగిన తరవాత ఎలిపోదుము. అగోద నుయ్యి..' సూపించినారట.
అయితే, 'పోన్లే తమ్ముళ్ళు అన్నారు కదా.. అనీసి రథము ఆపి, 'తాగీసి రాయండి' అంటే- అటీక ఎళ్ళొచ్చి 'మాకు సేద అందడము లేదు' అనీసంటే 'సరే ననుకోని ఆడు వస్తాడు.
వచ్చి, ఇలగ వంగుంతోటికి - ఇద్దరు రొండు కాలు పట్టి ఎత్తేస్తారు.. ఆనూతిల!
నూతిల ఎత్తిస్తే-?!?
ఇకన సూడు.. ఆనూతిలోనట ఎన్నాళనుండో ఒక పామున్నాదట... తల మీద పుండయిపోయి ఎవులు సేద ఏసిద్దురా.. ఎవులు రాయి ఇసిరిద్దురా... నాబాద నాకష్టం తీరిపోను' అని అది అలాగ నీటి మీదే ఆడుతందట!
ఈ సిన్నవాడెప్పుడు పడినాడో, పుండు పిగిలి బాద తీరిపోయి గబుక్కున పట్టీసుకున్నాదట పాము!
'.... నాయినా నువ్వు ఎందుకు ఇంతకు తెగించానావు? నువ్వు సూస్తే అంగ కుర్రోడువు. నీకొచ్చిన కష్టమేటి? ఇంత త్యాగం సెయ్యొచ్చునా? తప్పుకాదా?' అనీసి 'అయినా బాద తొలిగించావు. నా పుండు సిట్లిపోయింది నాయినా.. నేటికి నీను ఆరుమాసలయిన కంటికి నిద్దరలేదు. కడుపుకి తిండిలేదు. అంత బాదపడిపోతన్నాను. నువ్వు నా బాద తొలగించావయ్యా...' అనుకోని తిన్నగ నాగలోకం తీసికెళిపోయినాడట.
'ఏమింత పని సేసినావూ?' అంటే-
'.. నీను పడిపోవాలని పడిపోలేదు...' అనీసి ఈ కతంతా సెప్పుకొచ్చాడు. ' ఇదిగోటి నామారటి

తల్లి అందమ్ముల్లు ఆస్తికోసం ఇలగ సేసినారు..' అన్నాడట సిన్నవాడు.
'నువ్వు జయించిందెవర్నో కాదు.. మాయన్నని! నువ్వు పెళ్ళాడింది మాయన్న కూతుళ్ళనేని..! నాకూ ఒక్క గానొక్క కూతురున్నాదయ్యా... నువ్వు ఇంత వీరాది వీరుడువు. మంచోడువు. నాయన్నకే కాదు నవ్వు నాకూ అల్లుడవు' అనీసి కూతురికిచ్చి పెళ్ళి జరిపించీసి అక్కడినుండి తిన్నగ మళ్ళ బూలోకానికి పంపిచీసాడు.
ఈలోగ - ఇల్లీలిద్దరు ఈ రథమ్మీద కూచోని ఇంటికి తీసికెళిపోయి ఆ రథాల సావిట్ల ఆ రథం పడేనారు. పడీసి సుబ్బరంగ వూరుకున్నారు. ఆలకి తెలిస్తే కదా?!
ఇతను.. ఈ సిన్నవాడు బూలోకానికొచ్చాడు కదా.. ఈడూ మరక రథము బెత్తాయించి- ఆ పిల్లని తీసుకోని రథమ్మీద కూచోని వచ్చినాడు.. ఇంటికి.
ఇకన, అందరు సూస్తన్నారు.
సూస్తుంటే, రథాలసావిట్లోకి ఎళ్ళినాడు. 'నాకు తెలీని రథమా?' అనుకోని పోల్చిన రథమ్మీద ఇంత ఈ బూది ఏసినాడు. ఈబూది ఏసీసరికి ఐదుగురు అప్పజెళ్ళిళ్ళయినారు. ఈవిడతోటి ఆరుగురు! అక్కంటే 'సెల్లీ' సెల్లంటే 'అక్కా' అనుకున్నారు. పలకరించుకున్నారు.
తల్లి దగ్గిరికి తీసుకెళ్ళాడు.
అయితే ఊర్లోన ఏమనుకుంతన్నారూ?
'ఇదేటిది తండ్రికి సెట్టు తెస్తామనెళ్ళి... ఒక ఆరుగుర్ని ఎంటబెట్టుకోని వచ్చినాడు రాజు కొడుకు. పెద్దరాణీకొడుకు. ఇదేటిది?' అంటన్నారు. సిన్నోళు ఎళ్ళినారు. ఎలిపొచ్చినారు. ఎటీలేదు. పెద్దోడు ఎళ్ళినాడు. పెళ్ళాల్ని తెచ్చినాడు' అని సెవ్వులు కొరుక్కుంటన్నారు.
'నాయినా తెచ్చినావా?' తల్లి అడిగితే-
'తెచ్చినానమ్మా..' అన్నాడు. 'నీ దీవెనలు ఒట్టిన పోతాయా? పట్టుకోనే వచ్చాను. ఇదిగోటి సూపిస్తాను' అనుకోని తండ్రిదగ్గిరికెళ్ళాడు. ఎళ్ళి-
'నాయినా మీకు కలలోకి వచ్చిన సెట్టుని నేను తెచ్చాను. కాబట్టి మీరు దేశదేశాలోలికి పిలిపించండి.. ఒక సభ ఏర్పాటు సెయ్యండి.. ఆ సభలోన మీకు ఆ సెట్టుని సూపిస్తాను..' అన్నాడు.
'సరేని నాయినా.. తెచ్చావా నాయిన... తెచ్చావా నాయినా.. ' ముసిలోడు గాబరయి పోతన్నాడు. సరికన బలమొచ్చీసినట్టు లేసి కూకుండి పోనాడు. మంతిరిని కబురెట్టినాడు. అన్ని ఏర్పాటులల్ల

సెయ్యమన్నాడు.
ఏర్పాటులల్లా సేసినారు!
దేశదేశాలోలల్లా ఎలిపొచ్చినారు. రాజులూ.. యువరాజులూ.. ముసిలి రాజులూ.. అందరు ఎలిపొచ్చేసినారు. చక్రవర్తులూ... సామంతులూ.. దండనాయకులూ...
... ఏటాసెట్టు? ఎలాటి సెట్టు? ఎంత సింగారంగ వుంటాదో ఆ సెట్టు? ఎంత విలువగల సెట్టుకాపోతే రాజు మూలపట్టిపోడమేటి?' అని ప్రజలూ వచ్చారు. రాజులూ వచ్చారు. కిక్కిరిసి పూరు పట్టదట జనం!?
అప్పుడు తండ్రికి కూర్చీ ఏసి కూచోబెట్టాడట.
ఆ తర్వాతేటయ్యిందీ? అయిదుగురు అప్పజెళ్ళిళ్ళకి ముస్తాబయి వస్తుంటే ఈడు ఒక్కొక్కలికి నరుకుతుంటే-

**పెద్దదానికి నరికితే ఎండి మొదలయిపే!**
**రొండోదానికి నరికితే బంగారపు కొమ్మలయిపే!**
**మూడోదానికి నరికితే అపరంజి ఆకులయిపే!**
**నాలుగోదానికి నరికితే ముత్యాల గుత్తులయిపే!**
**అయిదో దానికి నరికితే హంసయిపే!**
**అందమీద నాట్యం ఆడింది.**

ఈదేశదేశాల జనమంతా సూసి ఆశ్చర్యమైపోనారట.
'ఓర్నాయన... ఈ హంస ఏటీనాట్యము? ఈ సెట్టు సింగారమేటి? అందుకే రాజు అలాగ మనో వ్యాది పట్టిపోయాడు. కొడుకంటే ఆడేనిరా.. తండ్రి ఋణం తీర్చుకున్నోడు. పెంచకపోయినా- వుంచకపోయినా - ఒకరోజు దగ్గిరికి సేరదియ్యకపోయినా - ఋణం తీర్చుకున్నాడు ఆడేని...'
ఎలాగొస్తే అలగే అనుకున్నారు. నోటికి తలుపా? ద్వారమా?
అనుకున్న తతువాత 'నాయినా సూసేవా?' అని తండ్రిని అడిగినాడు.
'సూసేను' అని అన్ని తరువాత-
అప్పుడు మళ్ళ ఇంత ఈబూది ఈ సెట్టు మీదేస్తే ఐదుగురు అప్పజెళ్ళిళ్ళయిపోనారు!
ఆజనంలోనే ఆకాశమంత పందిరేసి.. బూదేవంత పీనేసి... ఈ ఆరుగురికి వరసాగ ఆరుతాళిలు

సేయించి కట్టినాడట.
అప్పుడు తండ్రేమో... ఆడిన మాట తప్పకూడదు కదా
రాజులు.. అందుకే అర్ధరాజ్యము
రాసి ఇచ్చీసాడు. మరొచ్చి
కొడుక్కి పట్టాభిషేకం కట్టాడు.
ఇలగ జరిగిందని వృత్తాంతము
సెప్పాడు.
అలగ సెయ్యించిన పెళ్ళానికి
ముసిలిరాజు ఎగువ పిఁర
దిగువపిఁర కొయ్యించీసి
ఉప్పు పాతర్ల
వూరేయించీసినాడు.
కొడుకులిద్దరికి గుండగ
తన్నీసి.. బోడి గుండు
సేసీసి.. పిండి
సుక్కలు మసి సుక్కలు
ఎట్టీసి వూరేగించారు.
పెద్దబార్యకి తెచ్చుకోని
హాయిగ ఏలుకున్నాడు
రాజు?! ముసిలోడు.
ఈడేమో అరుగురు భార్యల్ని
ఏలుకోని హాయిగా వున్నాడు.
రాజ్యాన్ని కూడా ఏలుకొని.
అంతే... ఇంకేటి? కత సరి!

